క్లుప్తంగా

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కృపా జ్యోతి

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కృపా జ్యోతి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం అమరావతిలో సీఎంను కలిసిన ఆమె తనకు పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా భావనారుషి భద్రావతి పూజలు



గాంధీనగర్‌లో భవనారుషి-భద్రావతికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు ఆరిలోవ ప్రాంతం గాంధీనగర్‌లో భక్తమార్కెండేయ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం పద్మశాలి కులదైవం భావనారుషి భద్రావతి సమేత పూజలు ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు తమ కుటుంబాలతో కలసి ఉదయం ఇక్కడ పూజలు, రుద్రాభిషేకం చేశారు. అనంతరం భావనారుషి భద్రావతి చిత్ర పటాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తి కీర్తనలతో కాలనీలో సందడి చేశారు. సాయంత్రం ఇక్కడ ప్రాంగణంలో భజనలు చేశారు.

కృష్ణా కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం జువాలజీ, మ్యాథ్స్-2 పరీక్షలకు ఐదుగురు గైర్హాజరయ్యారు. కృష్ణా జూనియర్ కళాశాలలోని సెంటర్-ఏలో 673 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. ఐదుగురు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. కృష్ణా డిగ్రీ కళాశాలలో సెంటర్-బీలో 676 మందికి అందరూ పరీక్షకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.వి.వి.సూర్యకుమారి తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్‌కు చెందిన నాగమల్లేశ్వరి నగరంలోని ఓ కాలేజీలో పాలిటెక్నిక్ చదువుతోంది. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం 7 గంటలకు కళాశాలకు వెళ్లి.. తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు కాలేజీలో అడగ్గా.. విద్యార్థిని రాలేదని బదులిచ్చారు. ఆపై అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో నాగమల్లేశ్వరి తల్లి గురువారం సాయంత్రం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి ప్రశ్నాపత్రాల రాక



ప్రశ్నపత్రాల బాక్స్‌లకు తాళాలు చేస్తున్న హెచ్ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు

సీతమ్మధార: ఏప్రిల్‌లో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు గురువారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరాయి. పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ స్టేషన్‌కు వచ్చి ప్రశ్నాపత్రాల బాక్స్‌లకు తాళాలు వేసి సీల్ చేశారు. అనంతరం వాటిని ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో భద్రపరిచారు. టెన్త్ పరీక్షలకు ముందు ప్రశ్నాపత్రాలు ఓపెన్ చేస్తారు. అంతవరకు పోలీస్‌ల పర్యవేక్షణలో ఉంటాయి.

శిథిల స్థితిలో జీవీఎంసీ కాంప్లెక్స్

- పిఠాపురం కాలనీలో పెచ్చులూడుతున్న భవనం
- షాపింగ్ కాంప్లెక్స్‌లో సచివాలయం, పోస్టాఫీస్, మలేరియా ల్యాబ్, కిరాణ షాపు నిర్వహణ

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలోని జీవీఎంసీ షాపింగ్ కాంప్లెక్స్ అంటే స్థానికులు హడలిపోతున్నారు. కాలనీలో కళాభారతి ఆడిటోరియానికి ఆనుకుని ఉన్న ఈ షాపింగ్ కాంప్లెక్స్ భవనం చిన్నపాటి వర్షం పడినా శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. మూడు రోజు లుగా కురిసిన వర్షం కారణంగా గురువారం షాపింగ్ కాంపెక్స్ సన్‌షేడ్ నుంచి పెద్దపెద్ద పెచ్చులు ఊడి పడ్డాయి. రాత్రి సమయంలో పెచ్చులు పడడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇదే పగటి పూట అయితే పలువురు గాయలు పాలయ్యేవారని స్థానికులు అంటున్నారు. తాజా నగరంలో రామజోగిపేటలో మూడంతస్తుల ఇల్లు కూలిపోవడాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

నిత్యం రద్దీగా..

ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో పైఅంతస్తులో సచివాలయం ఉంది. ఇక్కడికి రోజూ సమస్యల పరిష్కారానికి జనం వస్తుంటారు. కిందన ఒక కిరాణ దుకాణం, ఆ పక్కనే పోస్టాఫీస్, దానిని ఆనుకుని మలేరియా ల్యాబ్ ఉంది. ఆ పక్కన జీవీఎంసీ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్యాలయాలు ఉన్నాయి. వీటికి నిత్యం ఆయా శాఖలకు చెందిన సిబ్బంది పదుల సంఖ్యల వస్తుంటారు. ఆయా కార్యాలయాల్లో పనుల విషయమై స్థానికులు కూడా వచ్చిపోతుంటారు. ఇలా నిత్యం జనంతో రద్దీగా ఉండే షాపింగ్ కాంప్లెక్స్ శ్లాబ్ శిథిల స్థితికి చేరి పెచ్చులు ఊడిపడుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్న పిఠాపురం కాలనీలో జీవీఎంసీ షాపింగ్ కాంపెక్స్ భవనం



సన్‌సేడ్ వెంబడి ఊడి పడుతున్న పెచ్చులు

కానరాని నిర్వహణ

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం తర్వాత సరైన నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వార్డు సచివాలయంతో పాటు, మలేరియా ల్యాబ్ ఉంది. వీటికి వృద్ధులు, జ్వరపీడితులు వస్తుంటారు. కిరాణ దుకాణానికి వినియోగదారులు వస్తుంటారు. ఆయా దుకాణాలు, కార్యాలయాల నుంచి నెలవారీ అద్దె తీసుకుంటున్న జీవీఎంసీ అధికారులు.. ఎందుకు ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

ఆరిలోవ: స్వాతంత్ర్య సాధనలో భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని కార్మిక హక్కుల కోసం పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపు నిచ్చారు. ముడసర్లోవ ప్రాంతం హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవెలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఎదురుగా సాయి భగత్‌సింగ్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో గురువారం భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్ర పటానికి కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో భగత్‌సింగ్ అతి చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేశారన్నారు. ప్రస్తుతం దేశంలో మోదీ ప్రభుత్వం సహజ వనరులను, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లపరం చేస్తుందని ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్నారు. దీంతో కుటుంబాలను పోషించుకోవడానికి ఎక్కువ మంది యువత ఆటో కార్మికులుగా గడుపుతున్నారన్నారు. అలాంటి వారిని కూడా ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. పన్నుల రూపంలో అదనపు భారం విధిస్తున్నారన్నారు. అనంతరం హెల్త్‌సిటీలో పినాకిల్ ఆస్పత్రి ముందు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో స్టాండ్ యూనియన్ అధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి రమణ, సభ్యులు పాల్గొన్నారు.



ముడసర్లోవ వద్ద భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

అప్పన్నకు శాస్త్రోక్తంగా స్వర్ణపుష్పార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళిని నిర్వహించారు.

పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈసేవను నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు శ్రీ వరాహ నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమంపడంలోని వేదికపై వేంజేంప జేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న ఉప ప్రధానార్చకుడు, ఉద్యోగులు

ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు ,ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేంపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజను నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ ఈపూజలో పాల్గొన్నారు.

రామజోగిపేట ఘటన దురదృష్టకరం

మహారాణిపేట : నగరంలోని రామజోగిపేటలో గురువారం తెల్లవారు జామున భవనం కూలి మృతి చెందిన ఎస్.అంజలి (15), ఎస్.దుర్గాప్రసాద్ (17) మృతదేహాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ గురువారం కేజీహెచ్ మార్చురీకి వెళ్లి పరిశీలించారు. అనంతరం సంతాపం వ్యక్తం చేశారు. సీతారామ్‌తో పాటు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఏఆర్ఎంవో డాక్టర్ జగదీష్ తదితరులు కూడా మృతదేహాలను పరిశీలించారు. శవ పరీక్షలు నిర్వహించి బంధువులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సీతారామ్ ఆదేశించారు. ఇదే ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న తల్లిదండ్రులను క్యాజువాలిటీకి వెళ్లి పరామర్శించారు. ఇద్దరు పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు భగవంతుడు మానసిక స్థైర్యం కల్పించాలని సీతారాం అన్నారు. సందర్శించిన వారిలో ఏఆర్ఎంవో కేవీ అరుణాదేవి, ఆస్పత్రి వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధులు జి.శరణ్య, మాలతి, డాక్టర్ జగ్గారావు, కె.ఎల్లయ్య తదితరులు ఉన్నారు.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారామ్

క్షతగాత్రులకు యువసేన సాయం : రామజోగిపేటలో మూడంతస్తుల భవనం కూలిన ఘటనలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని యువసేన ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు పీలా హరిప్రసాద్ గురువారం పరామర్శించారు. తీవ్ర గాయాలపాలైన రామారావు, కళ్యాణిలకు రక్తం సరఫరా చేసే విషయంలో హరిప్రసాద్ చొరవ చూపించారు. అలాగే సంఘటనా స్థలానికి చేరుకుని మంచినీళ్ల బాటిళ్లు, ఆహారం సరఫరా చేశారు. సహాయక బృందాలకు అల్పాహారం అందజేశారు.

నేడు సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శన

మద్దిలపాలెం : విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలవారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించనున్నామని అసోసియేషన్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ కల్చరల్ విభాగం జోన్ కన్వీనర్ వంకాయల మారుతీ ప్రసాద్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

27న మార్కెట్లకు వేలంపాటలు

జగదాంబ: సూర్యాబాగ్‌లోని జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో ఈ నెల 27న వివిధ మార్కెట్లకు సంబంధించి వేలంపాటలు నిర్వహిస్తున్నట్టు జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలోని 12 వార్డుల్లో ఉన్న మార్కెట్లు, జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, పార్కుల ప్రవేశ రుసుములు, చెట్ల ఫలసాయానికి సంబంధించి ఈ ఏడాది మార్చి 1 నుంచి 2024 మార్చి 31 వరకు గుత్తేదారుకు ఇచ్చే విషయమై వేలం వేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు సూర్యాబాగ్ జోన్-4 కార్యాలయంలో హాజరు కావాలని జెడ్సీ కోరారు.

విద్యా సమాచారమ్

ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్(ఏయూ టీడీఆర్ హబ్) ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏయూ టీడీఆర్ హబ్‌లో ప్రవేశం పొంది 18 నెలల కాలం ముగిసిన వారికి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు హబ్ డైరెక్టర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. పరీక్షలు పటిష్టంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంపై రెక్టార్ సంతృప్తి వ్యక్తం చేశారు.

బీసీల సభ జయప్రదానికి పిలుపు



సంఘీభావం తెలుపుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

సీతంపేట: బీసీల డిమాండ్ల సాధనకు ఈ నెల 25న రాజమహేంద్రవరంలో తలపెట్టిన 'హలో బీసీ-ఛలో రాజమహేంద్రవరం' సభను జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జన గణనలో కుల గణన జరగాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, పార్లమెంట్‌లో బీసీల మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. ఉద్యోగులకు పదోన్నతులు, రిజర్వేషన్లు కలిఁచాలన్నారు. బీసీ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పాల్గొని బీసీల సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. ఈ ఐదు డిమాండ్ల సాధనకు రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద శ్రీవెంకటేశ్వర ఆనం కళాక్షేత్రంలో జరిగే సభకు బీసీలందరూ హాజరై విజయవంతం చేయాలని నరేష్ యాదవ్ కోరారు. సమావేశంలో రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ పిళ్లా నివాస్, రాష్ట్ర ప్రచార కమిటీ ఇన్‌చార్జి పిళ్ల దినేష్‌కృష్ణ, రాష్ట్ర స్టూడెంట్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి చిన్ని కిషోర్ యాదవ్, జిల్లా మహిళాధ్యక్షురాలు సత్యలత, నరేష్, కలపర్తి లక్ష్మి, ఆన చంద్రప్రసాద్ తదితరులు సంఘీభావం తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

తగరపువలస: జాతీయ రహదారిపై బుధవారం రాత్రి వలందపేట వద్ద ఆగి ఉన్న లారీని ఓ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాకుళం జిల్లా పాత కురిమినాయుడపేటకు చెందిన ఆటో డ్రైవర్ నిమ్మ అప్పలనాయుడు(33)కు గాయాలయ్యాయి. ఒడిశా రాష్ట్రం సిమ్లగూడకు చెందిన లారీ బ్రేక్ డౌన్ కారణంగా రోడ్డు పక్క నిలిపేశారు. ఈ లారీని విశాఖ నుంచి శ్రీకాకుళం వెళుతున్న ఆటో ఢీకొట్టగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆటో నుజ్జు అయింది. ఈ ప్రమాదం జరిగిన తరవాత వెనక నుంచి కారులో వస్తున్న ఇద్దరు శ్రీకాకుళం వాసులు వీటిని తప్పించబోయి అవతలి రోడ్డులో బస్‌ను ఢీకొట్టి మృత్యువాత పడ్డారు.



ప్రమాదంలో నుజ్జు అయిన ఆటో

అప్పన్నను దర్శించుకున్న గిరిజన పూజారులు



సింహగిరిపై గిరిజన పూజారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ని గురువారం అల్లూరి సీతారామారాజు జిల్లా లోని పలువురు గిరిజన పూజారులు దర్శించుకున్నారు. ఆ జిల్లాలోని పలు గ్రామా ల్లో విశ్వ హిందూ పరిషత్ ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి ఆలయాల్లో వీరంతా పూజారులుగా ఉన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని టీటీడీ నిర్మిస్తున్న 163 ఆలయాల్లో కూడా వీరంతా పూజారులుగా విధులు నిర్వహించనున్నారు. ఈ తరుణంలోనే శుక్రవారం భీమిలిలో జరిగిన ఒక సమావేశానికి వచ్చిన వీరంతా తొలుత సింహాచలంలో స్వామివారిని దర్శించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్లూరి జిల్లాలోని ఆలయా ల నిర్మాణాల పర్యవేక్షకుడు రాంబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రకృతి రక్షణకు కృషి చేయాలి

ఎంవీపీకాలనీ: ప్రకృతి రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా ప్రతినిధి హాని సెలెస్ కోరారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్‌తో పాటు నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలలో విద్యార్థులకు గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాని సెలెస్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ ఈ నెల 25వ తేదీన రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు ధరిత్రి గంటలను పాటిస్తాయన్నారు. ఒక గంట విద్యుత్ ఉపకరణాలు నిలిపివేయడం ద్వారా పర్యవరణ రక్షణ ఆవశ్యకతను చాటడంతో భాగస్వాములు అవుతున్నాయన్నారు. నగర వాసులు కూడా శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేసి సహకరించాలని కోరారు. గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జేవీ రత్నం, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ధరిత్రి గంట కార్యక్రమంపై అవగాహన కోసం ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

ఎంవీపీకాలనీ: ఇద్దరు విదేశీ విద్యార్థినులు బైక్‌పై వెళుతూ పెదవాల్తేరుకు చెందిన త్రినాథ్ పాత్రో (65)ను ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానం సర్కిల్ సమీపంలో ఉషోదయ కూడలికి వెళ్లేమార్గంలో గురువారం ఉదయం ప్రమాదం జరిగింది. ఈ ఘనటపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్విట్జర్లాండ్‌కు చెందిన జకిథి ముక్వానజి(23), బొంగెకిలే మ్సిబి(23) ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. ఎంవీపీ కాలనీలోని విదేశీ విద్యార్థుల వసతిగృహంలో నివాసముంటున్నారు. వీరు గురువారం ఉదయం బైక్‌పై కళాశాలకు వెళుతున్నారు. కిరాణా, వెజిటేబుల్స్ వ్యాపారం చేస్తున్న త్రినాథ్ పాత్రో ఆ మార్గంలో ఓ ఇరానీ ఛాయ్ దుకాణం వద్ద టీ తాగాడు. అనంతరం తన టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనంపై యూటర్న్ తీసుకునేందుకు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ఆ మార్గంలో వేగంగా వస్తున్న విదేశీ విద్యార్థినుల బైక్ అతనిని ఢీకొట్టింది. దీంతో త్రినాథ్ పాత్రో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆయని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘనటపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.



త్రినాథ్‌పాత్రో మృతదేహం

సిరులతల్లికి సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజతోపాటు త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. తులసీదళ్చారనలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



తులసీ దళార్చనలో కనకమహాలక్ష్మి

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. రూ.500 చెల్లించిన దంపతులు లేదా ఇద్దరు భక్తులను ఈ ప్రత్యేక పూజకు అనుమతించనున్నారు. వివరాలకు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

5న 'చలో ఢిల్లీ'

అల్లిపురం: మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ(కార్మిక, కర్షక సంఘర్ష్ ర్యాలీ) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, కె.ఎం.కుమార్ మంగళం, పి.మణి, కార్యదర్శి బి.జగన్‌తో కలిసి ఆయన చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ అత్యంత ధనవంతులైన అదానీ, అంబానీ వంటి వారి సేవలో మోదీ సర్కారు మునిగి తేలుతోందని ఆరోపించారు. కార్మిక చట్టాల్లో మార్పులు చేసి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్‌లపై పన్నులు పెంచి ఏడాదికి మూడున్నర లక్షల కోట్ల భారం ప్రజలపై మోపుతున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ, ఏఐకేఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న లక్షలాది మందితో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ విధానాలను ఓడించేలా ఈ ఉద్యమం సాగుతుందని పేర్కొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

బోట్ డ్రైవర్ మృతి కేసులో ఇద్దరి అరెస్టు

అల్లిపురం: ఫిషింగ్ హార్బర్ డ్రైవర్ మృతి కేసులో ఇద్దరు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ సీఐ రేవతి తెలిపిన వివరాల ప్రకారం ఫిషింగ్ హార్బర్ రెండవ నంబరు జెట్టీలో మంగళవారం రాత్రి బోట్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ కేసులో పెయిందొరపేటకు చెందిన వాసుపల్లి రాము, సురపతి కనకరాజులను గురువారం ఉదయం ఫిషింగ్ హార్బర్‌లో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పెండింగ్ ఫైన్లపై ప్రత్యేక డ్రైవ్



ఎన్ఏడీ జంక్షన్ వద్ద ఆటోలను ఆపి పరిశీలిస్తున్న సీఐ మళ్ల అప్పారావు

గోపాలపట్నం: ఆటోలపై ఉన్న పెండింగ్ ఫైన్లు వసూలు చేసేందుకు ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఎన్ఏడీ జంక్షన్ దిగువ సర్కిల్ వద్ద ఆటోలను ఆపి ఎన్ని జరిమానాలు పెండింగ్ ఉన్నదీ.. అవి ఎంత అని పరిశీలించి వసూలు చేసే ప్రక్రియ చేపట్టారు. ఈ విధమైన తనిఖీలు ప్రతి రోజూ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఇంత వరకు ఈ ఫైన్లపై ఉదాసీనంగా ఉన్న పోలీసులు ఇప్పుడు ఉక్కు పాదం మోపారు. భారీ స్థాయిలో ఈ ఫైన్లు ఉంటాయని ఆటో డ్రైవర్లే చెబుతుండటం విశేషం.